

# "క్రిస్మస్"

## - ఆధునిక మానవ జ్ఞానానికందని క్రీస్తు జన్మదినారాధన?!

**నేటి** ఆధునిక యుగంలోని అత్యధిక ప్రజలు అమితానందంతో జరుపుకొనే గొప్ప పండుగ క్రిస్మస్. క్రిస్మస్ ఎందుకు జరుపుతున్నారు అని ఎవ్వరిని అడిగినా ప్రభువైన యేసుక్రీస్తు పుట్టిన దినం అని టక్కున సమాధానం చెబుతారు. బైబిల్‌లోగాని చరిత్రలోగాని సరియైన ఆధారాలు (తేది, నెల, సంవత్సరం) లేకుండా జరుపుకొంటున్న మహోత్సవమిది అంటే ఆశ్చర్యపోక తప్పదు. ప్రాశ్చాత్య దేశాలలోనైతే ఒక నెల జరుపుతారు. మన దేశంలో కూడా యూత్ క్రిస్మస్, టౌను క్రిస్మస్, ఐక్య క్రిస్మస్ ఇలా అనేక పేర్లతో దాదాపు సగం నెల సంబరాలు చేస్తున్నారు. "ఒకని జన్మదినం కన్నా, మరణదినమే మేలు" (ప్రసంగి 7:1) అనే దేవుని వాక్కును మరచి మనుషులు కల్పించిన మతాచారాలను పాటించి క్రైస్తవ్యాన్ని మతంగా మార్చిన ఘనులే నేటి క్రైస్తవులు అని బాగా ఆలోచిస్తే అర్థం అయితీరుతుంది. (మార్కు 7:6-9).

దేవుని వాక్యమైన బైబిల్ గ్రంథాన్ని పరిశుద్ధాత్మ సహాయంతో ఆలోచించి ఆయన చెప్పినట్లు (1పేతురు 1:8-11) చదివి ఆలోచించి పరిశీలించినట్లు అయితే (2తిమోతి 2:7, ఎఫెసీ 3:3-12, అపో.కా. 17:11) ఈ క్రిస్మస్‌యొక్క అర్థం, పవిత్రత, ప్రాధాన్యత ఎంతో గొప్పగా వుండేది. దేవుడు మరుగు చేసిన మర్మాన్ని మనిషి లెక్కగట్టి ఆయన జన్మదినాన్ని క్రీ॥పూ॥ 4వ సం॥ అని చెప్పి ఆయనను ఈ లోకంలో ఎంతో చిన్నవాడుగాను, ఒక కొత్త మత స్థాపకుడుగా చూపించే ప్రయత్నం చేశారు. నేటి భారతంలోని కొందరు సోదరులు మీ క్రీస్తు నిన్నగాక మొన్న పుట్టిన బచ్చా అని వాదిస్తున్నారు. అందుకే క్రీస్తు జన్మదినమెపుడో ప్రపంచానికి ప్రకటించాలని ఈ పత్రిక వ్రాయుచున్నాను. మరియు క్రీస్తు రెండవ రాకడను గూర్చి ఎదురుచూస్తూ ప్రకటిస్తున్న వారికి ఆయన మొదటి రాకడను గూర్చి మీకు తెలియ కుండుట నాకిష్టం లేదు గనుక క్రీస్తు లోకంలోనికి వచ్చాడా? ఈ లోకంలో పుట్టాడా? అని దేవుని వాక్యాధారంతో ముందుకు వెళుదాం (1కొరింథీ 2:1-16) ఇది సిలువ వేయబడిన క్రీస్తును ప్రకటిస్తున్న మహాజ్ఞానమని మరచి పోకండి. (1కొరింథీ 1:21-25).

లోక రక్షకుడైన క్రీస్తు పుట్టాడనే విషయాన్ని కేవలం ఆనాటి పామరులైన గొర్రెల కాపరులకు మాత్రమే దేవుడు తన దూత ద్వారా తెలియపర్చాడు. "దావీదు పట్టణమందు నేడు రక్షకుడు మీకొరకు పుట్టియున్నాడు. దానికిదే మీకానవాలు, ఒక శిశువు పొత్తిగుడ్డలతో చుట్టబడి ఒక తొట్టిలో పండుకొనియుండుట మీరు చూచెదరని వారితో చెప్పెను"

(లూకా2:8-12). ఆ తర్వాత అన్యులు, లోకజ్ఞానులైనవారు కూడా ఆకాశ నక్షత్రమును చూచి ఒక మహారాజు పుట్టాడని గ్రహించి వచ్చి ఆయనను పూజించారు (మత్తయి 2:1-11). దేవుని సైన్యమైన దేవదూతలు మాత్రము దేవునికి స్తోత్రములు చేసి మహిమపరచారు. దీనిని బట్టే క్రైస్ట్ + మాస్ = క్రిస్టమస్ (క్రీస్తు ఆరాధన), క్రిస్మస్ అనే పదమును మనవారు వాడుకలోనికి తెచ్చి పుట్టినరోజు పండుగకు పునాది వేశారు. అయితే దేవుని ప్రజలైన ఆనాటి ఇశ్రాయేలీయులు తమ మెస్సియాకోసం ఎదురుచూస్తున్నా వారికి మాత్రం ఆయన పుట్టాడని తెలియజేయలేదు దేవుడు. ఇది ఆశ్చర్యం, అద్భుతం. అలాగే నేటి దేవుని ప్రజలైన, క్రీస్తు శిష్యులైన క్రైస్తవులకు కూడా క్రీస్తు అపొస్తలుల ద్వారా చెప్పలేదు దేవుడు. ఇది మరింత ఆశ్చర్యం. ఆయన ఇశ్రాయేలీయులకు వారి ప్రవక్తల ద్వారా ముందే చెప్పినది ముందుగా ఆలోచించి, ఆ తర్వాత క్రీస్తు, అపొస్తలుల బోధను చూద్దాం.

"కన్యక గర్భవతియై కుమారుని కనును ఆయనకు ఇమ్మానుయేలు అనుపేరు పెట్టబడును" (యెషయా 7:14, క్రీ॥పూ॥ 700)

"ఏలయనగా మనకు **శిశువు పుట్టెను,** మనకు కుమారుడు అనుగ్రహింపబడెను..." (యెషయా 9:6,7).

ఇక్కడ యెషయా తన ప్రజలతో అప్పటికే దేవుని కుమారుడు పుట్టెను అని వ్రాశాడు. అందుకే కన్యక గర్భవతియై కుమారుని కనును అన్నాడే గాని కుమారుడు పుట్టును అనలేదు. వైద్యభాషలో, దేవుని వాక్యప్రకారంగా పుట్టడం వేరు, కనడం వేరు. కనడం అనగా డెలివరీ లేదా ప్రసవించుటఅంటారు. పుట్టేది పురుషునికి మాత్రమే (మత్తయి 1:1,2, యెషయా 49:5,15). తల్లి గర్భంలో మనుషులందరి పుట్టుక లేదా జన్మదినం రహస్యమేనని బైబిల్ ద్వారా దేవుడు క్రీ॥పూ॥ 1000 సంవత్సరములో దావీదు ద్వారా లోకమంతటికి తెలియజేసాడు. (కీర్తన 139:13-16). ఇందును బట్టే దేవుడు క్రీస్తు జన్మదినమును గూర్చి బైబిల్‌లో వ్రాయించలేదు, చరిత్రకారులకు దొరకనివ్వలేదు. అయితే క్రీస్తు జన్మదినం జరపాలనే ఆనందంలో ఉన్న మనం ఆయనకు జన్మనిచ్చిన తండ్రిని అనగా దేవునిని అడిగితే, కన్నవాడు ఖచ్చితంగా దినం మనకు చెప్పక యేసుతో చెప్పిన విషయాన్ని క్రీ॥పూ॥ 1000సం॥రాల క్రితం అదే దావీదు ద్వారా "నీవు నా కుమారుడవు **నేడు** నేను నిన్ను కనియున్నాను" (కీర్తన 2:7) అని పలికించాడు. దేవుడు చెప్పిన ఈ **నేడు**ను కనుగొనాలంటే నరుని మస్తిష్కం బ్రద్దలై, నరాలు నలిగి, పగిలిపోతాయి గనుక, దేవునికి ముందే పుట్టిన క్రీస్తు మరలా నరుని గర్భము నుండి ఈ ఆకారానికి రావడానికి వీలు లేదు (మనిషి ఒకేసారి పుడుతాడు, పుట్టాలి) గనుక పరిశుద్ధాత్మ సహాయంతో కన్యక గర్భవతి అయితే ఆ కుమారుడు శరీరాన్ని ధరించుకొని మన మధ్యకొచ్చాడని యోహాను ద్వారా వ్రాయించాడు. (యోహాను 1:1-14).

అందుకే ప్రవక్తయైన మీకా యేసు రాకడను గూర్చి, పుట్టుకగా కాక వస్తాడు అని వ్రాశాడు. "బెత్లేహేము ఎఫ్రాతా, యూదావారి కుటుంబములలో స్వల్ప గ్రామమైనను

నాకొరకు ఇశ్రాయేలీయులను ఏలబోవువాడు **నీలో నుండి వచ్చును.** పురాతన కాలము మొదలుకొని శాశ్వత కాలము ఆయన ప్రత్యక్షమగుచుండెను.'' (మీకా 5:2 క్రీ.పూ. 600సం॥). ఇది తెలిసిన లూకా గారు పశువుల పాకలో పుట్టెను అని వ్రాయక ఒక తొట్టిలో పరుండబెట్టియుండుట అని చెప్పాడు. జన్మస్థలం చెప్పినా అక్కడ గుడికట్టే రకం ఈ మనుషులు అని ముందే తెలిసిన దేవుడు క్రీస్తు జన్మస్థలం మరుగుచేశాడని ఆలోచిస్తే అమోఘం (లూకా 2:1-7). ఇక యేసుక్రీస్తునే అడుగుదాం ప్రభువా నీవెప్పుడు పుట్టావో అర్జంటుగా చెప్పు మాకవతల టైమ్ అయిపోతుంది పండక్కి అంటే ఆయన కూడా తను ఎప్పుడు పుట్టాడో, ఎక్కడ పుట్టాడో చెబుతున్నాడు జాగ్రత్తగా బైబిల్ ద్వారా సరిచూసుకుందాం.

"పూర్వకాలమందు... నేలమట్టిని రవంతయు సృష్టింపకమునుపు **నేను పుట్టితిని....**'' (సామెతలు 8:22-36, క్రీ॥పూ.॥ 1000 సం॥రాలు).

"యేసు, అబ్రాహాము పుట్టక మునుపే **నేను ఉన్నాను....**'' (యోహాను8:58 క్రీ.శ. 28).

"యేసు, నేను పరలోకము నుండి **దిగి వచ్చితిని...**'' (యోహాను 6:32, 59, 3:13)

"నశించిన దానిని వెతికి రక్షించుటకే మనుష్య కుమారుడు **వచ్చెను**'' (లూకా 19:10)

"నేను మరలా వచ్చి మిమ్ముల్ని పరలోకంలోని తండ్రి వద్దకు తీసుకువెళ్తాను'' (యోహాను 14:1-6).

యేసుప్రభువు స్వయంగా చెప్పిన దానిని బట్టి ఆలోచిస్తే ఆయన ఈ భూమి పుట్టక ముందే పరలోకంలో పుట్టినట్లుగా అర్థమగుచున్నది. విశ్వాసులకు, తండ్రియైన అబ్రహాము (క్రీ॥పూ॥ 2500 సం॥లు) పుట్టక మునుపే ఉన్నాడు గనుకనే ఈ లోకానికి వచ్చాను అన్నాడు తప్ప పుట్టాను అనలేదు. ఆయన పుట్టినపుడు ఈ లోకమే లేనపుడు, డిసెంబరు నెల 25వ తేది క్రీ॥పూ॥ 4 సం॥ (4బి.సి.)అనియు, మరొక నెల, సంవత్సరం అనే వాటిని ఊహిస్తేనే మన మతిమాడి మసై పోవాలి, అదియు గాక ఇలా చెబితే పరిశుద్ధాత్మకు వ్యతిరేమని గుర్తుంచుకోవాలి. అందుకే ఇది క్రీస్తు మొదటి రాకడ. ఈ సత్యం తెలిసినా క్రీస్తు మొదటి రాకడ అని చెప్పే ధైర్యం లేక అసత్యం నుండి బయటకు రాలేక ఈ సత్యాన్ని ప్రకటించేవారిని సిలువ వేసే దశలోనికి వెళ్లింది నేటి క్రైస్తవ్యం.

సమస్త మానవుల రక్షణ కోసం లోకానికొచ్చి సిలువలో మరణించి తిరిగి లేచిన క్రీస్తును ప్రకటించి అందరిని పరలోకం చేర్చాలనే క్రీస్తు శిష్యుల బోధలను చూసి మనం ఇంకా ఆనందంలో తేలియాడుతూ, నిజమైన, బలమైన విశ్వాసంతో ముందడుగు వేసి మసక వెలుతురులో మునిగిన క్రైస్తవ్యానికి క్రీస్తు వెలుగును ప్రకాశింపజేసే నిజమైన జ్యోతుల (నక్షత్రాలం) అవుదాం. ఆ నాడు అనామకులకు సృష్టిలోని నక్షత్రం దారి చూపితే, ఆ నక్షత్రాన్ని మన ఇంటిమీద పెట్టుకొని మురిసిపోక మనమే జ్యోతులమై ఈ గ్రుడ్డిలోకానికి వెలుగైన క్రీస్తును చూపుదాం (ఫిలిప్పీ 2:14-16, దానియేలు 12:3).

"ఆయన (క్రీస్తు) అదృశ్య దేవుని స్వరూపియై సర్వసృష్టికి ఆది సంభూతుడై ఉన్నాడు" (కొలస్సీ 1:15-17)". కలిగియున్నదేదియు ఆయన లేకుండా కలుగలేదు." (యోహాను1:2,3)

"పాపులను రక్షించుటకు క్రీస్తు యేసు లోకానికి "వచ్చెనను" వాక్యము నమ్మదగినదియు పూర్ణాంగీకారమునకు యోగ్యమునై ఉన్నది." (1తిమోతి 1:15, 3:16).

"ఆయన ఈ లోకమందు ప్రవేశించునపుడు..." (హెబ్రీ 10:5)

"కడవరి కాలములయందు ఆయన ప్రత్యక్షమాయెను..." (1పేతురు 1:21)

పై వాక్యాలను బట్టి ఆలోచిస్తే ఈ లోకాన్నే కలుగజేసిన యేసుక్రీస్తు ప్రభువు ఈ లోకంలో కేవలం 2000 సం॥రాల క్రితం పుట్టాడనడం హాస్యాస్పదమే అవుతుంది. ఇల్లు కట్టినవాడు ఇంట్లో పుట్టడు గదా! కేవలం గృహప్రవేశం చేస్తాడు గనుక, పరలోకంలో పుట్టి, ఈ లోకాన్ని పుట్టించి సమస్తానికి అనగా ఈ లోకంలో పుట్టిన దేవుళ్ళు, దేవతలు, మనుషులందరికి ప్రభువైన క్రీస్తు, అందరిని పాప విముక్తి చేయడానికి మొదటిసారి దివి నుండి భువికి దిగివచ్చాడు. రక్షింపబడ్డ వారిని దేవునికి అప్పగించడానికి రెండవ సారి కూడా రానైయున్నాడు. అందుకే "ఆయన జన్మదినం కన్నా మరణ దినమే మేలు" అని రాజైన సొలొమోను ద్వారా వ్రాయించాడు. కాబట్టి క్రీస్తు మొదటి రాకడ సందర్భంగా మా సంతోషం కోసం ఈ క్రిస్మస్ పండుగ జేస్తున్నామనే వారిని దేవుడు జ్ఞాపకముంచేసుకొనే అవకాశం లేదు కానీ లోకానికొచ్చిన యేసుక్రీస్తు నీలోనికి నీ పొరుగువారి హృదయంలోనికి వచ్చి మనల్ని బ్రతికించిన రోజే నిజమైన పండుగ ఆచరించడానికి అర్హులం. జన్మదినం ద్వారా గాక మరణదినం ద్వారా సంతోషపడి సంబరం (కీర్తన 118:22-24) చేసుకొంటూ సువార్తను ప్రకటించే వారినే దేవుడు ఆశీర్వదించి, దీవిస్తాడని మరచిపోక, ఏ పండుగను ఘనంగా చేసి, దేవునిని క్రీస్తును ఘనపరుస్తారో మీకే వదలి వేస్తూ, అందరికి తండ్రియైన సర్వేశ్వరుడు, సర్వోన్నతుడైన దేవుడు మనలందరిని తన ఆత్మ చేత ముద్రించి, తన వాక్యపు వెలుగులో నడిపించి, క్రీస్తు రాజ్యంలో నిలిపి, మన లోకాన్ని తిరిగి మనం స్వతంత్రించుకొనే భాగ్యాన్ని కలుగజేయును గాక... ఆమేన్..

సిలువ వేయబడిన క్రీస్తును ప్రకటిస్తున్న
మీ ఆత్మీయ సోదరుడు **డా॥ బొంకూరి జాన్**


**Dr. BONKURI JOHN,** Director & Evangelist
**Institute of Bible Technology Hyd & Temples of God Meet Here Church**
Ph : 040-20000700 Cell : +91-9440142887
e-mail : johnbonkuri@bhelhyd.co.in www.bibletechnology.net

**Bible College :** #06-264/13/1/5H, Aeronautics Enclave, Opp. Godavari Homes & Club
Suchitra Bus Stop to Quthbullapur Main Road, Chintal Post, Quthbullapur GHMC, Hyd-500 054, India

**for Free Bible Training** contact : **Bro. J. RAVI,** Admn. Officer - IBT, Cell : 9440792192
**Bro. D. PRASADA RAO,** Principal - IBT, Cell : 9959372221
9440551149, 9869469229, 9848961763, 9849554106, 9441727357, 9247128962,
9963623438, 9866509138, 9490453041, 9704692533, 9949242423, 9346373553